క్లుప్తంగా

సాక్షాలు లేని ఆరోపణలు మానుకోండి

- ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం
- టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే సవాల్

నరసరావుపేట: పిచ్చిపిచ్చి ప్రేలాపనలు మానుకోండి.. సాక్షాలు, ఆధారాలు లేని ఆరోపణలు మానండి.. ఏమైనా ఉంటే మరికొన్ని రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాని టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. ఎవరు, ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా తాను సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గురువారం అరవిందబాబు తనపై గుట్కా, ఇసుక, మట్టి, భూ ఆక్రమణ, మున్సిపాల్టీ, బెదిరింపులు, కేసులు అంటూ చేసిన ఆరోపణలను మరోమారు ఖండించారు. అతను ఆధారాలు, సాక్షా లు లేని ఆరోపణలు తనపై పదేపదే చేస్తూ తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. నిజానిజాలతో సంబంధం లేకుండా తన అసిస్టెంట్ రాసిచ్చిన స్టేట్‌మెంట్ చదవటమే అతని నైజమన్నారు. గతంలో తాను చేసిన చాలెంజ్‌కు రెండింటిలో సాక్ష్యాలు ఉన్నాయని చెప్పాడని, వాటిలో ఒకటి కేసానుపల్లి రోడ్డులో భూమి, రెండోది విజయవాడలో పొలం, స్థలంపై సాక్ష్యాలు అంటూ చూపించాడన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధ్వర్యంలోని తమ ప్రభుత్వం 90 శాతం పేదవారికి మేలు చేసిందన్నారు. ఎన్నికలు వస్తున్నాయని టీడీపీ నాయకులు మరీ దిగజారి ప్రవర్తిస్తున్నారన్నారు. మాదిగ కార్పొరేషన్ డైరక్టర్ కందుల ఎజ్రా మాట్లాడుతూ తన ఉనికిని కాపాడుకునేందుకే అసత్య ఆరోపణలు చేస్తున్నాడన్నారు. శృతి మించితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అరవిందబాబును హెచ్చరించారు. సమావేశంలో షేక్.కరిముల్లా, పచ్చవ రవీంద్రబాబు, వంపుగుడి జాన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో గణపవరం విద్యార్థి సత్తా



నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాయదిగడ నాని గణేష్‌రాజు ఆడుదాం ఆంధ్రా పోటీల్లో రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించాడు. తొమ్మిదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థి అండర్ 17 విభాగంలో జిల్లా జట్టు నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల నరసరావుపేటలో జరిగిన పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొన్న ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు మూడోస్థానం సాధించింది. విద్యార్థి వికెట్ కీపర్ కమ్ బ్యాట్స్‌మెన్‌గా ప్రతిభ చూపాడు. విద్యార్థి ప్రతిభను హెచ్‌ఎం కృష్ణానాయక్, పీడీ వేణుగోపాల్, పీఈటీ జాస్తి శ్రీకాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

వికసిత్ భారత సంకల్ప యాత్ర

బొల్లాపల్లి: మండలంలో మాలపాడు, మూగచింతలపాలెం, వెల్లటూరు, రేమిడిచర్లలో వికసిత భారత సంకల్ప యాత్ర శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ కె జిలానీ బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు తీరు గురించి వివరించారు. డ్రోన్ యంత్రం ద్వారా పొలాల్లో వేసిన పంటలకు పురుగు మందుల పిచికారి చేసే విధానం పై వివరించారు. కేంద్ర ప్రభుత్వ నుంచి అందిన వస్తువులను గ్రామంలో పలువురికి అందజేశారు.

పదవులు పొంది.. విమర్శించడం దుర్మార్గం

వినుకొండ(నూజెండ్ల): వేల్పూరు గ్రామాన్ని తన దైన శైలిలో ఎమ్మెల్యే అభివృద్ధి చేశారని, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మండల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన కొంతమంది నాయకులు ఎమ్మెల్యేని విమర్శించడాన్ని తప్పుపట్టారు. వేల్పూరు గ్రామంలో కోల్డ్ స్టోరేజీ నిర్మాణం, నూతన వైద్యశాల, గ్రామ సచివాలయం, నూతంగా సీసీ రోడ్లు , సొసైటీ గొడౌన్ అద్దంకి బ్రాంచి కెనాల్ నుంచి గ్రామానికి తాగునీటి సౌకర్యం వంటి ఎన్నో అభివృద్ధి పనుల చేశారని మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పది సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉండి తన స్వగ్రామాన్ని కూడా అభివృద్ధి చేయలేకపోయారన్నారు. అభివృద్ధి విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. కేవలం స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీ పదవులు అనుభవించిన వారు కూడా వాస్తవాలు మరచి ఎదుటివారిపై బురద చల్లే ప్రయత్నం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, పార్టీ నాయకులు తుమాటీ కప్పారావు, రంతు శ్రీనివాసరావు, స్వర్ణాల వెంకటరావు పలువురు నాయకులు పాల్గొన్నారు.



వినుకొండ కోర్టు ఆవరణలో జెండాను ఎగురవేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్‌హుస్సేన్



గణపవరంలో పతాకం ఎగురవేసి అభివాదం చేస్తున్న వలేటి వెంకటేశ్వరరావు



పేటలో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న మల్లెల రాజేష్ నాయుడు



నూజెండ్లలో జెండా వందనం చేస్తున్న ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, అధికారులు



యడ్లపాడులో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ కుటుంబరావు

రాజ్యాంగం ద్వారానే దేశానికి సార్వభౌమం

- వాడవాడలా ఘనంగా గణతంత్ర వేడుకలు
- నాటి స్వాతంత్ర్య వీరుల త్యాగాలను స్మరించుకున్న నేతలు, అధికారులు

నరసరావుపేట: భారత రాజ్యాంగ అమలులోకి వచ్చిన 1950 జనవరి 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించుకుంటున్నామని శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. 75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని డీఎస్‌ఏ స్టేడియంలో ప్రభుత్వం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరై జిల్లా అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, గిరిజన, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాజేటి సాంబశివరావు, నాయకులు పాల్గొన్నారు.

నూజెండ్ల మండలంలో ..

వినుకొండ(నూజెండ): నూజెండ్ల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలతో పాటు పలు పార్టీల ఆధ్వర్యంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా జాతీయ జెండాను ఎగురవేసి జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, నూజెండ్ల జడ్పీహెచ పాఠశాలతో పాటు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన జెండా వందన కార్యక్రమాల్లో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులురామయ్య, ఎంపీడీవో వీరభద్రాచారి, మండల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో....

శావల్యాపురం: భారతదేశ ఆర్థిక ప్రగతి సాధించటానికి రాజ్యాంగం ఎంతో కీలకమని మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ఎంపీడీవో కార్యాల య ప్రాంగణంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఎంఈవో కార్యాలయంలో, ఎంఈవో య.సాంబశివరావు, ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి యం.రాధాకృష్ణన్, విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏఈ గాంధీ, పోలీసు స్టేషన్‌లో ఎస్సై తుళ్లూరి తిరుపతిరావులు తివర్ణ పతకాన్ని ఆవిష్కరించారు

మది నిండుగా.. రిపబ్లిక్ డే పండుగ

వినుకొండ(నూజెండ్ల): 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ, రూరల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు పలు విద్యాసంస్థలు, వివిధ పార్టీలు తమ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులతో ప్రత్యేక వేషధారణలు నిర్వహించి గణతంత్ర దినోత్సవంపై సాంస్కృతిక కార్యక్రమాలు, క్విజ్, వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి చిన్నారులకు బహుమతులు అందజేశారు.



నరసరావుపేటలోని సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, నాయకులు

వినుకొండలో....



వినుకొండలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): భారతీయులందరూ సమానత్వంతో జీవించాలని, కులమతాలకు అతీతంగా ఎందరో మహానుభావులు తమ ప్రాణ్యాలను త్యాగం చేశారని స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొల్లా జాతీయ జెండా వందనం చేసి జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ భారతరాజ్యాంగాన్ని రచించిన మహానుభావుల ఆశయ సాధన కోసం భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గ్రామస్వరాజ్యాన్ని తీసుకొచ్చారన్నారు. అర్హత గల ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో...

పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి ఎం . మహతి జాతీయ జెండాను ఎగురవేశారు. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చాగంటి వీరాంజనేయచౌదరి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, న్యాయవాద గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడులో....

యడ్లపాడు: భారత గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, స్వచ్ఛంద సేవా సంస్థలు మువ్వెన్నెల జెండాలు ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు ఎగురవేయగా, మండల పరిషత్ కార్యాలయంలో ఏవో సాయి శ్రీనివాసరావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్ కుమార్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణతంత్ర విశిష్టతను, స్వాతంత్ర్య కోసం పోరాడిన మహనీయులను వివరించారు. నారాయణ ఇంగ్లీషు మీడి యం పాఠశాలలో విశ్రాంత ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ పోపూరి గంగయ్యచౌదరి జెండాను ఆవిష్కరించగా, విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రిన్సిపల్ చెరుకూరి సృజన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగం మనది

చిలకలూరిపేట: ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగాన్ని దేశానికి అందించిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌దేనని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాత్మా గాంధీ, బీఆర్ అండేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం మల్లెల రాజేష్‌నాయుడు ప్రసంగించారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: భారత దేశానికి అత్యున్నత రాజ్యాంగం అందించిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం సచివాలయంలో రిపబ్లిక్‌డే సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆదంవలి, సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు శేఖర్, కవిత, జ్యోతిర్మయి, సిబ్బంది, వలంటీర్లుపాల్గొన్నారు. శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన షేక్ సుభానీ రూపొందించిన 500 అడుగుల పొడవైన జాతీయ పతాకాన్ని 900 మంది విద్యార్థులతో గ్రామ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణానాయక్, పీడీ వేణుగోపాల్, పీఈటీ జాస్తి శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈపూరులో

ఈపూరు: 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుధాకర్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రంగనాయకులు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఫిరోజ్, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం యొక్క విశిష్టతను వివరించారు. అనంతరం ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు చాకెట్లు, బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జె బలరామ్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.

బొల్లాపల్లిలో.....

బొల్లాపల్లి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో 75వ గణతంత్ర దినోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎన్.దుర్గేశ్వరరావు, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ బత్తి రాములు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కె జిలానీ బాషా, ఎస్ఐ డి.చెన్నకేశవులు, ఎంఈఓ 2 కె.పార్వతి, వైద్యాధికారి పి.శంకరనారాయణ, పలు ప్రభుత్వ కార్యాలయల వద్ద ఆయా శాఖల అధికారులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జెండా ఎగురవేశారు. ఆయా శాఖల అధికారులు జెండా వందనం గావించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు గణతంత్ర దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని విద్యా సంస్థలలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో పాలకవర్గం అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్‌సీసీ కాడేట్స్ గౌరవ వందనం స్వీకరించారు. కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య, హవల్దార్ బ్రిజేష్ కుమా ర్, కమిటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. జేఎన్ టీయూ-ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీ.హెచ్. శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శోభన్ బాబు, వ్యాయమ సంచాలకుడు డాక్టర్ జీ పి రాజు, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ భవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు మానం సుబ్బారావు, గుర్రం అప్పిరెడ్డి, సి.ఆదెయ్య, పి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో, కార్యాలయాలలో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి. అంకారావు, మండల పరిషత్ కార్యాలయంలో ఎండీవో కె.మాధ్యుబాబు, పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ మణివర్మలు జాతీయ పతాకాలను ఆవిష్కరించగా, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డీఎం. సుభాని, సంతగుడిపాడు ఎంపీపీఎస్ పాఠశాలలో హెచ్‌ఎం విజయకుమారిలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అన్ని గ్రామా ల్లోని పాఠశాలలో, గ్రామ సచివాలయం, పంచాయతీ, పీఏసీఎస్ కార్యాలయాలలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సీఈవోలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకల దృశ్యం



వినుకొండ బీసీ గురుకుల పాఠశాలలో పిరమిడ్ ఆకారంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

వేర్వేరు ప్రాంతాల్లో కులగణన సర్వే

ఎంపీడీవో సీతారామయ్య



శావల్యాపురంలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: కుల గణన సర్వే పురోగతి వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రం శావల్యాపురంలో కుల గణన సర్వే కార్యక్రమం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో కుల గణన సర్వే కార్యక్రమం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సంయుక్తంగా నూరు శాతం చేయాలన్నారు. సర్వే పనులు జ్యాపం కాకుండా సచివాలయ ఉద్యోగులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. కుల గణన సర్వేలో ప్రజల భాగస్వామ్యం కావాలన్నారు. ఆయనతో పాటు గ్రామసచివాలయ వేల్ఫేర్ సహాయకులు రంతు లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సరైన వివరాలు తెలపాలి

నాదెండ్ల: కులగణన మండలంలో వేగంగా జరుగుతోంది. ఈ నెల 28తో గడువు ముగియనుంది. దీంతో సచివాలయ సిబ్బంది వలంటీర్ల సాయంతో ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకూ శ్రమిస్తున్నారు. నాదెండ్లలో జరుగుతున్న కులగణనను ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు గ్రామంలోని ఇళ్లను సందర్శించినపుడు సామాజిక, ఆర్థిక వివరాలతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు పూర్తిగా తెలియజేయాలన్నారు. ఇలాంటి వివరాలు వెల్లడించినందునే ప్రజలకు ప్రభుత్వం నుంచి మెరుగైన సత్ఫలితాలు వస్తాయన్నారు.

ఉచిత వైద్యశిబిరంలో 216 మందికి వైద్యసేవలు

- శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- 50 మందికి ఉచితంగా ఆపరేషన్లు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండవీడు ఇఎన్‌టీ హాస్పిటల్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 216 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో డాక్టర్లు రోగులకు చెవి, ముక్కు, గొంతుకు సంబంధించి రక్తం, వినికిడి పరీక్షలు, ఎక్స్‌రే చేసి సుమారు రూ.1.30 లక్షల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. వినికిడి లోపం ఉన్నవారికి 30 శాతం రాయితీపై పరికరాలను అందజేశారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 50 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు.

నరసరావుపేట కమిషనర్‌గా నిరంజన్‌రెడ్డి

నరసరావుపేట: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం శుక్రవారం నిర్వహించిన బదిలీల్లో నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా పి.నిరంజన్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న ఎం.రామ్మోహన్ నందిగామ పురపాలక సంఘానికి బదిలీ అయ్యారు.

నవోదయలో మువ్వెన్నెల జెండా రెపరెపలు

చిలకలూరిపేటటౌన్: 75వ గణతంత్ర దినోత్సవాన్ని పలు విద్యాసంస్థలు, కార్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయంలో ధనలక్ష్మీ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఎం లింగయ్య చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపల్ నల్లూరి నరసింహా రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పట్టణంలోని డీఆర్‌ఎన్‌ఎస్‌సీవీఎస్ డిగ్రీ కళాశాలలో కళాశాల అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరా సుజాత పాల్గొన్నారు. మండలంలో పసుమర్రు గ్రామంలోని మద్దికామయ్య జెడ్పీహైస్కూల్లో హెచ్‌ఎం వై.హనుమంతరావు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.





లింగంగుంట్ల గ్రామం వద్ద గాయపడిన వారిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు. ఆస్పత్రి ప్రాంగణంలో గుమిగూడిన వేలూరు గ్రామస్తులు.
-చిలకలూరిపేట